క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో రోడ్డు పనులకు కార్పొరేటర్ దౌలపల్లి కొండ బాబు సోమవారం శంకుస్థాపన చేశారు. వార్డులోని క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కలి ్పంచడంలో తమ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు 2, 3న ప్రత్యేక డ్రైవ్



సమావేశంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, తదితరులు

తగరపువలస: ఓటర్ల నమోదుకు డిసెంబర్ 2, 3న ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఓటర్లలో చైతన్యం కలిగించేందుకు మంగళవారం మధురవాడలో విద్యార్థులు, ప్రజాసంఘాలతో భారీ ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో నాయకులు గాడు శ్రీను, కదిరి ఎల్లాజీ, డి.ఎ.ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



బాలాజీ

భీమునిపట్నం: భీమిలిలో ఒక వ్యక్తి అదృశ్యమైనట్టు సోమవారం ఫిర్యాదు అందింది. చిన్నబజారు సమీపంలో నివసిస్తున్న పల్లంశెట్టి బాలాజీ (40) షర్బత్ షాపు నిర్వహిస్తున్నాడు. భార్య దమయంతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిస కావడంతో తరచూ భార్యతో గొడవలు పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంతవరకు తిరిగి రాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు మోడల్ పరీక్ష

తగరపువలస: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరుకాబోవు విద్యార్థులకు సోమవారం చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష నిర్వహించారు. 90 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆర్థిక సాయంతో స్టేషనరీ అందించారు. సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రేక అప్పారావు, ఉపాధ్యాయుడు పక్కి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భారీగా సముద్ర స్నానాలు



భీమిలి తీరంలో స్నానం చేస్తున్న భక్తులు

భీమునిపట్నం: భీమిలి తీరంలో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. ఆదివారం కార్తీక పౌర్ణమి కావడంతో అనేక మంది ఉపవాసాలు ఉన్నారు. కార్తీక సోమవారం కావడంతో ఉదయం ఆరు గంటల నుంచి పెద్ద సంఖ్యలో స్నానాలు చేయడానికి తీరానికి విచ్చేశారు. సముద్రంలో అలలు కూడా తక్కువగా ఉండడంతో ఎవరూ ఇబ్బంది పడకుండా ప్రశాంతంగా స్నానాలు చేశారు.

వివక్ష లేకుండా అర్హులందరికీ పథకాలు



సామయ్యవలసలో పథకాల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు




ఏనుగులపాలెంలో కుళాయిల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- పథకాల అమలులో దేశంలో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: సంక్షేమ పథకాల అమలులో దేశంలో రాష్ట్రాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అగ్రగామిగా నిలిపారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఇసక కళ్లాలు, సామయ్యవలస, మునివానిపాలెంలో సోమవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయడం లేదన్నారు. వివక్షకు తావులేకుండా అర్హులందరికీ పథకాలు అందజేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేశారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పచ్చ చొక్కాల వారికే పథకాలు మంజూరు చేసేవారన్నారు. పేదవాడి సంక్షేమం కోరే జగన్ మరోసారి సీఎం కావాలా...? డబ్బున్న వారి సంక్షేమం కోరే చంద్రబాబు సీఎం కావాలా..? ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. ఇసక కళ్లాల్లో కాలనీ ఇళ్ల మంజూరు చేయాలని, కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరగా డిసెంబర్ నెలాఖరులోగా అర్హులందరికీ కాలనీ ఇళ్ల మంజూరు చేయడంతోపాటు కుళాయిలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. సామయ్యవలసలో జలజీవన్ మిషన్ నిధులు రూ.20.90 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయిలు శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఇసక కళ్లాల్లో నిర్మించనున్న రక్షిత మంచి నీటి పథకానికి నాలుగు సెంట్ల స్థలం ఉచితంగా ఇచ్చిన బెల్లాన సన్యాసిరావును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు అముజూరి అప్పారావు, పల్లి మహేష్, పిన్నింటి రమణ, కర్రోతు వెంకట రమణ, కత్తిరిశెట్టి వెంకటరావు, వి.లక్ష్మిబాబు, వి.శ్రీనివాసరావు, పి.జగ్గారావు, పి.కొండలరావు, కె.సూరిబాబు, పి.శ్రీనివాస్, మరగడ అప్పారావు, బోని సన్యాసినాయుడు, మొకర అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

రూ.74 లక్షలతో రక్షణ గోడ



రెండు నెలల్లో నాణ్యతతో నిర్మించిన రక్షణ గోడ





సత్యనారాయణమెట్ట వద్ద గతంలో కూలిన గోడ

తగరపువలస : గతంలో ఎక్కడైనా కట్టడం కూలిపోయినా... ఏదైనా సమస్య తలెత్తినా... ఆ సమస్య ఏళ్ల తరబడి అపరిష్కృతంగా అలా నిలిచిపోయేది. స్థానికులు ఎంత ఇబ్బంది పడినా అప్పటి పాలకులు అటువైపు కన్నెత్తి చూసేవారు కాదు... 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. ప్రజల అవసరాలు, సమస్యలు గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అధికారులు ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకు నిదర్శనమే సత్యనారాయణపేట వద్ద 20 రోజుల్లో రూ.74 లక్షలతో నిర్మించిన రక్షణ గోడ. జీవీఎంసీ రెండో వార్డు సత్యనారాయణపేటలో గత ఏడాది సెప్టెంబర్‌లో రక్షణగోడ కూలిపోయింది. 2004కు ముందు టీడీపీ హయాంలో సత్యనారాయణపేట వాలు ప్రాంతాల ప్రజల రక్షణకు రెండు చోట్ల నిర్మించిన రక్షణగోడలు చిన్నపాటి వర్షాలకే కూలిపోయాయి. అందులో 2022 సెప్టెంబరులో కూలిన సంఘటనలో 50 మీటర్ల పొడవైన సీసీరోడ్డు, 15 అడుగుల ఎత్తయిన రక్షణగోడ శిథిలాలు 30 మీటర్ల దూరం వరకు పడిపోయాయి. స్థానికులకు ఆస్తినష్టం జరిగింది. అంతకు ముందే మరో రక్షణగోడ కూలిన ఘటనలో ఒకరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

జీవీఎంసీ నిధులతో తక్షణమే నిర్మాణం

సత్యనారాయణపేటలో గత ఏడాది కూలిన రక్షణ గోడ ప్రాంతంలో జీవీఎంసీ రూ.74 లక్షల సాధారణ నిధులు ఉపయోగించి కేవలం 20 రోజుల్లో కొత్తగా గోడ నిర్మించింది. ఆరు మీటర్ల ఎత్తు, 22 మీటర్ల వెడల్పుతో దుర్భేద్యమైన కోటగా దీనిని నిర్మించారు. దీంతో వాలు ప్రాంతంలో నివసించేవారికి ఈ రక్షణగోడ పెట్టనికోటలా ఉంది. దీనిపై ప్రభుత్వానికి, అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించింది



రక్షణగోడ కూలిన చోట అప్పటికే రైతు బజారు నిర్మాణంలో ఉంది. అయినప్పటికీ ఆ పనులకు కాస్త విరామం ప్రకటించి వాలు ప్రాంత ప్రజల సంక్షేమాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకుని రక్షణ గోడ నిర్మాణ పనులు ముందు పూర్తి చేశారు. నాణ్యతతో నిర్మించడంతో తరాలపాటు నిలిచి ఉంటుంది. – ఏలూరి రాంబాబు, తగరపువలస

నాణ్యమైన పని చేశారు



గతంలో టీడీపీ ప్రభుత్వం ఇక్కడ నిర్మించిన నాసిరకం రక్షణగోడలు చిన్నపాటి వర్షానికే కూలిపోయేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం రక్షణ గోడ అంటే ఇలా ఉండాలిరా అన్నట్టు స్థానికులు కూడా ఊహించని విధంగా నిర్మించి చూపించారు. దీంతో ఈ వాలు ప్రాంతంలో ధైర్యంగా ఉంది. – చేట్ల నరసింగరెడ్డి, సంతపేట

ఐఐఎంకు గోస్తనీ నుంచి తాగునీరు సరఫరా

- రూ.9 కోట్లతో పైప్‌లైన్ ఏర్పాటు



ఐఐఎంకు తాగునీరు సరఫరా కోసం ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విద్యాలయానికి తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ఇన్‌స్టిట్యూట్ గంభీరం రిజర్వాయర్ పక్కనే ఉన్నప్పటికీ అక్కడి నీరు తాగడానికి ఉపయోగపడకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని బోని గ్రామంలో ఉన్న వాటర్ వర్క్స్ నుంచి పైపులు ద్వారా ఐఐఎంకు నీటిని తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం సంస్థ విద్యానిధి నుంచి రూ.9 కోట్లు కేటాయించింది. ఈ మేరకు బోని వాటర్ వర్క్స్ నుంచి 12.5 కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. దాని ద్వారా ఐఐఎంకు చేరిన నీటిని అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిల్వ కేంద్రాలకు తరలించి విద్యా సంస్థలోని వివిధ విభాగాలకు సరఫరా చేస్తారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. మరోవైపు బోని వాటర్ వర్క్స్ నుంచి నగరానికి కూడా తాగునీరు సరఫరా అవుతోంది.

పొడుగుపాలెంలో ఆక్రమణ తొలగింపు

ఆనందపురం : స్థానిక పంచాయతీ పరిధిలోని పొడుగుపాలెంలో గ్రామ కంఠం స్థలం ఆక్రమణను రెవెన్యూ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల ముందు భాగంలో కొంత గ్రామ కంఠం ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలాన్ని విద్యార్థులు ఆట స్థలంగా వినియోగిస్తున్నారని స్థానికులు అంటున్నారు. కాగా ఆ స్థలం ఆక్రమణకు గురైనట్టు తహసీల్దార్‌కు స్థానికుల నుంచి ఫిర్యాదు అందింది. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది ఆ స్థలాన్ని పరిశీలించి అక్కడ అక్రమంగా నిర్మిస్తున్న పునాదులను తొలగించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్సాహంగా భగవద్గీత పఠన పోటీలు

కొమ్మాది: విశాఖ చిన్మయి మిషన్ ఆధ్వర్యంలో భీమిలి సద్గురు శ్రీ శివానందమూర్తి ఆశ్రమంలో నిర్వహించిన భగవద్గీత పఠన పోటీలు సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పఠన పోటీల్లో 125 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు వైశ్యరాజు జ్యుయలర్స్ అధినేత ఫాల్గుణరాజు బహుమతులు అందజేశారు. మిషన్ సభ్యులు గంగాధరరావు, రత్నం, సుబ్రహ్మణ్యం, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ కోసం స్పోర్ట్స్ కిట్లు సిద్ధం



కిట్లు పరిశీలిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: క్రీడల్లో యువతను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమానికి సంబంధించి భీమిలి జోన్, మండల పరిధిలోని క్రీడాకారులకు కిట్లు సిద్ధం చేశారు. ఈ మేరకు సమీపంలోని కీతిన్‌పేట వద్ద గల ఒక ప్రైవేటు స్కూల్‌లో కిట్లను భద్రపరచగా వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సోమవారం పరిశీలించారు. మొత్తం 34 సచివాలయాలు ఉండగా ప్రతి సచివాలయానికి ఒక కిట్ అందిస్తారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్‌కు సంబంధించి సామగ్రి అందులో ఉంటుంది. ఆయా సచివాలయాల పరిధిలో 15 సంవత్సరాలు దాటిన బాల, బాలికలు పేర్లు నమోదు చేసుకుంటే వారిని ఎంపిక చేసి కోరిన ఆటల్లో శిక్షణ అందిస్తారు. త్వరలో ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభంకానుంది.

ఆర్టీసీ కొరియర్, పార్సిల్ కౌంటర్లు ప్రారంభం



మారికవలసలో ఆర్టీసీ సర్వీసు కౌంటర్ వద్ద అధికారులు

ఆనందపురం : రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) తన సేవలను విస్తరించడంలో భాగంగా ఆనందపురం, మారికవలస ప్రాంతాల్లో సోమవారం కౌంటర్లను ప్రారంభించింది. ఈ రెండు ప్రాంతాల్లో అడ్వాన్స్ రిజర్వేషన్‌తోపాటు పార్సిల్, కొరియర్ సర్వీసు కౌంటర్లను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించిన ఏపీఎస్ ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ కౌంటర్ల వద్ద సిబ్బందిని నియమించడం వల్ల అన్ని వేళల్లోనూ కొరియర్స్, పార్సిల్స్ పంపించుకోవచ్చన్నారు. ఈ రెండు ప్రాంతాలకు చెందిన వారు గతంలో తగరపువలస లేదా మధురవాడ వెళ్లి సేవలు పొందాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం స్థానికంగానే సేవలు లభ్యం కావడంతో ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీకి 29న గుర్తింపు శిబిరం

మధురవాడ: ఉపకరణాలు పంపిణీకి దివ్యాంగులను గుర్తించడానికి చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరం నిర్వహించనున్నట్టు కార్యక్రమం కో కన్వీనర్ తాతపూడి ప్రదీప్‌కుమార్ చెప్పారు. అలీమ్ కో సహకారంతో అర్హులైన దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ కోసం గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు, మోటార్ రైజ్‌డ్ ట్రై సైకిళ్లు, క్లచ్చస్, బ్లైండ్ స్టిక్స్, వినికిడి యంత్రాలు, మానసిక వికలాంగులకు కిట్స్ పంపిణీకి అర్హులను గుర్తిస్తామని చెప్పారు. అవసరమున్న దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రదీప్ కుమార్ కోరారు. శిబిరానికి వచ్చే వారు సదరం సర్టిఫికెట్, ఆధార్, తెల్ల రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 95021 96387లో సంప్రదించాలని కోరారు.

‘కల్వర్టు, రహదారిని అనుసంధానించండి’



బొగ్గురోడ్డులో ఇటీవల నిర్మించిన కల్వర్ట్, రహదారిని అనుసంధానించాల్సిన ప్రదేశం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ చిట్టివలస, చిల్లపేట గ్రామాలను అనుసంధానిస్తూ రూ.75 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న బీటీ రహదారి పనుల్లో ఆలస్యం కారణంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. 1, 2 వార్డులను కలుపుతూ ఉన్న ఈ రహదారి మధ్యలో కల్వర్టు నిర్మించి రహదారికి అనుసంధానం చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా సుఖీభవ కాలనీ లోనుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ కాలనీలో రహదారులు కూడా శిథిలం కావడంతో మరింత ఇబ్బందిగా ఉంటుందని అంటున్నారు. కల్వర్టు నిర్మించి 20 రోజులు గడుస్తున్నా రహదారికి అనుసంధానించకపోవడంతో చుట్టూ తిరిగి రాలేక పోతున్నామని వాహనదారులు అంటున్నారు. ప్రస్తుతం రహదారి నిర్మాణం జరగనందున వాహనాల రాకపోకలకు వీలుగా కల్వర్టుతో రహదారిని కలపాలని పలువురు కోరుతున్నారు.

స్పందనకు 8 వినతులు

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఎనిమిది వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి అయిదు, రెవెన్యూ విభాగానికి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి ఒక వినతి వచ్చింది. వీటిని పరిశీలించి త్వరలో సమస్యలు పరిష్కరిస్తానని జెడ్సీ రాము తెలిపారు.

బీటీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రకాశ్‌బాబు

మధురవాడ: బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండి ప్రకాశ్‌బాబు ఎన్నికయ్యారు. ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర కమిటీలో ఆయనకు చోటు దక్కింది. ఆయన ప్రస్తుతం విశాఖ జిల్లా అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. ఆయన ఎంపిక పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మార్మోగిన శివనామస్మరణ



మధురవాడలో పూజలకు విశేషంగా హాజరైన భక్తులు



బసవపాలెం శివాలయంలో అభిషేకం చేస్తున్న శివస్వామి



అర్ధనారీశ్వరునిగా శివయ్య దర్శనం



పూజలందుకున్న శివయ్య

తగరపువలస: కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలు శివ పంచాక్షరి నామంతో మార్మోగాయి. ఆలయాల్లో భక్తులు మహాదేవునికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అన్నవరం – అమనాం రహదారిలో బసవేశ్వరుని ఆలయంలో శివస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

భీమునిపట్నం: కార్తీక సోమవారం సందర్భంగా చోడేశ్వర ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 4 గంటల నుంచి భక్తులు రాగా అర్చకులు సుబ్రహ్మణ్యం ప్రత్యేక పుజలు చేశారు. గుగ్గిళ్ల గున్నేశ్వరరావు దంపతులు భక్తులకు పులిహోర ప్రసాదం అందించారు.

కొమ్మాది: కార్తీకమాసం రెండో సోమవారం శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే శివయ్యను పూజించేందుకు భక్తులు బారులు తీరారు. బీచ్ రోడ్డు హంసవనం పుణ్యక్షేత్రం రామాద్రిలో, ఎండాడ రుషికొండ శివాలయంలో, మారికవలస శివాలయాల్లో భక్తులు పంచామృతాభిషేకాలు నిర్వహించి దీపారాధన చేశారు.

మధురవాడ: అభిషేక ప్రియునికి భక్తులు బిల్వపత్రాలు, పువ్వులు, ఇతర పత్రాలు సమర్పించి విశేషంగా పంచామృత, నారికేల, పండ్ల రసాలు, జలాభిషేకాలు చేశారు. కార్తీక మాసం రెండో సోమవారంతోపాటు పౌర్ణమి కూడా కలిసి రావడంతో భక్తులు మధురవాడలోని పలు శివాలయాలకు విశేషంగా తరలివచ్చారు. ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వర స్వామి ఆలయం, మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, మధురవాడ జంక్షన్‌లోని సిద్ధేశ్వర స్వామి పీఠం, మారికవలస ఆర్‌జీకే కాలనీ విజయదుర్గా ఆలయంలో కొలువై ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంతోపాటు ఇతర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పీఎం పాలెం: కారుషెడ్ కూడలిలోని శ్రీ కాశీ ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు సామూహిక అభిషేకాలు చేశారు. బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలోని శ్రీ ఉమా సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో లక్ష బిళ్వార్చన చేశారు.



కారుషెడ్ కూడలిలోని శివాలయంలో భక్తులు

వైభవంగా కార్తీక జ్వాలా తోరణోత్సవం



శ్రీ కాశీ ఉమా మహేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కాంతులు వెదజల్లుతున్న జ్వాలా తోరణం

పీఎం పాలెం: పుణ్య కార్తీక పౌర్ణమి సందర్భంగా కారుషెడ్ కూడలిలోని శివాలయం ప్రాంగణంలో ఆదివారం రాత్రి జ్వాలా తోరణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

తగరపువలస: అగ్ని ప్రమాదంలో నష్టపోయిన జస్వంత్ రెడీమేడ్స్ యాజమాన్యానికి తన వంతు సాయంగా రూ.50 వేలు అందించనున్నట్టు వజ్రచంద్ర మెడికల్ షాపు యజమాని దుర్గా రామకోటి ప్రకటించారు. ఈ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్టు తెలిపారు. దాతలు స్పందించాలని కోరారు.